

## న్యూస్ బాక్స్

### మళ్లీ చలి.. చలి..

సిరిసిల్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రతకు ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వారంరోజులుగా ఉష్ణోగ్రతుల సాధారణంగా ఉండగా, మంగళవారం ఒక్కసారిగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కనిష్ఠ ఉష్ణోగ్రత జిల్లాలో 9.1 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత 34.7 డిగ్రీలుగా నమోదైంది. గంభీరావుపేటలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9.1, రుద్రంగి, వీర్నపల్లిలో 10.8, బోయినపల్లిలో 11.0, తంగళ్లపల్లిలో 11.1,చందుర్తిలో 11.2, వేములవాడ రూరల్‌లో 11.5, కోనరావుపేటలో 11.9, సిరిసిల్లలో 12.0 డిగ్రీలుగా నమోదైంది.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేములవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వేములవాడ పట్టణ సెస్ ఏఈ సిద్ధార్థ ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి జాతరకు సంబంధించిన ముందస్తు పనుల్లో భాగంగా పట్టణంలోని భగవంతరావు నగర్, భీమేశ్వర ఆలయం ఏరియా, బద్ది పోచమ్మవీధి, పోలీస్ స్టేషన్ ఏరియాలలో ఉదయం 9 గంటల మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### మహాసభలు పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈనెల 30, 31వ తేదీలో జరిగే బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు విజ్ఞప్తి చేశారు. మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు కేవీ అనసూర్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎల్ల దేవరాజు, గాజుల పోశెట్టి, గంగవ్వ, పుష్పలత, రస్మిక, సుల్తానా, సోఫియా తదితరులు ఉన్నారు.

# నిలదీతలు.. నిరసనలు



వీర్నపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను నిలదీస్తున్న గ్రామస్థులు



తంగళ్లపల్లి మండలం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై ప్రశ్నించిన గ్రామస్థులు
- జాబితాల్లో అర్హుల పేర్లు లేవని ధ్వజం
- జిల్లాలో తొలిరోజు 77 గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లో 18 వార్డుల్లో సభలు
- గ్రామసభల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- నేడు రుద్రంగి గ్రామసభకు రానున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్
- నిఘా నీడలో.. మొక్కుబడిగానే గ్రామసభలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సుదీర్ఘకాలంగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న పేదలు... సంవత్సరకాలంగా ఊరిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో పేర్లు లేకపోవడంతో నిరసనలు వ్యక్తం అయ్యాయి. తమ దరఖాస్తులు ఏమైనట్లని అధికారులను నిలదీశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అర్హుల జాబితాలతో గ్రామ సభ లకు శ్రీకారం చుట్టారు. ఈనెల 24వరకు జరిగే గ్రామ సభలు, మున్సిపల్ పరిధిలోని వార్డుసభలు పోలీస్ నిఘానీడలో మొక్కుబడిగానే సాగాయి. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా, తొలిరోజు 77గ్రామ సభలు, రెండు మున్సి పాలిటీలు సిరిసిల్ల, వేములవాడలో 18వార్డుల్లో సభలు నిర్వహించారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల, రేషన్‌కార్డుల జాబితాల్లో పేర్లు లేక పోవడంపై అధికారులను ప్రశ్నించారు. సర్వే పక్రియ మొక్కుబడిగా చేశారని అందుకే తమ పేర్లు లేవని నిరసనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారనే విమర్శలు వచ్చాయి. జిల్లాలోని వీర్నపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభకు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను జాబి తాల్లో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని నిలదీశారు. రేషన్ కార్డుల జాబితాల్లోనూ పేర్లు లేవని ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. కొంత ఉద్రిక్త పరిస్థితి కనిపించడంతో సభ మధ్యలోంచే అదనపు కలెక్టర్ వెళ్లిపోయారు. ఇల్లంతకుంటలో ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నా తమ పేర్లు లేవని నిలదీశారు. జాబితాలపై గ్రామసభలో అభ్యంతరాలు చెప్పాలని కోరడం సరైన విధానం కాదని అర్హులైన వారందరికి ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల జాబితాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది నాయ కులు తమ వారికే పథకాలు వచ్చేలా చేసుకున్నారని విమర్శించారు. అనంతగిరి గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలోనే గ్రామ సభను ముగించేశారు. ముస్తాబాద్ మండలంలో చీకోడు, చిప్పలపల్లి, రాంరెడ్డిపల్లె, సేవాలాల్ తండా, మొర్రాపూర్, గ్రామాల్లో నిర్వహిం చిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అన ర్హులకే లబ్ధి చేకూరే విధంగా ఉన్నాయని ప్రశ్నిం చారు. ఇది తుదిజాబితా కాదని అధికారులు నచ్చ జెప్పారు. అర్హత ఉన్నవారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని తహ సీల్దార్ సూచించారు. తంగళ్లపల్లి మండలంలోని ఏడు గ్రామాల్లో జరిగిన సభల్లో తమపేర్లు జాబితాలో లేవని అధికారులను ప్రశ్నించారు. ఇది నిరంతర పక్రియ అని పేర్కొన్నారు. గంభీరావుపేట మండలంలోని మల్లుపల్లె, కోళ్లమద్ది, రాజుపేట, లక్ష్మీపూర్, జగదాంబ తండా, పొన్నాలపల్లె గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకున్న పేర్లు రాలేదని అడిగారు. ఎల్లారెడ్డిపేట మండలంలో అరు గ్రామాల్లో జరిగిన సభల్లో జాబితాలు గందరగోళంగా ఉన్నాయని అధికారులను నిలదీశారు. అధికారులు మళ్లీ దరఖాస్తులు...

మిగతా 8లో

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ఎజెండా

**- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వార్డు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ఎజెండాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన వార్డు సభల్లో భాగంగా మంగళవారం వేములవాడ పట్టణంలోని 22వ వార్డు పరిధిలో పాత కూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో పేదలకు కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని, ఇంటి స్థలం లేని వారికి రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టి ఇస్తామన్నారు. అర్హులు ఎవరైనా గతంలో దరఖాస్తు చేసుకోకున్నా, ఏదేని కారణం వల్ల జాబితాలో వారి పేర్లు రాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నాలుగు రోజులపాటు జరిగే గ్రామసభల్లో మరోసారి దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయంలోనూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పేద ప్రజలు, మహిళల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉండి పనిచేస్తుందని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా కనీసం రేషన్ కార్డు లేకపోవడంతో అనేకమంది ఎన్నో ఇబ్బందులు పడ్డారని, దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తప్పనిసరిగా రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, పట్టణంతోపాటు రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 76 కోట్ల రూపాయలు మంజూరు చేశారని, అన్నదాన సత్రం నిర్మాణం కోసం 35 కోట్ల రూపాయలు అదనంగా మంజూరు చేశారని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 8, 12, 18, 21, 22, 25వ వార్డులలోనూ ప్రజాపాలన వార్డు సభలను నిర్వహించారు.

## హెలీప్యాడ్‌ను పరిశీలించిన ప్రభుత్వ విప్, కలెక్టర్



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్ తదితరులు

రుద్రంగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాల అమలు సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామసభకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి సభా ప్రాంగణం, మంత్రుల హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్‌ను ప్రభుత్వ విప్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలపై గ్రామ, వార్డుస్థాయిల్లో చేపట్టే ప్రజాపాలన వార్డుసభలను పకడ్బందీగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారిలతో కలిసి డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క ప్రజాపాలన గ్రామ, వార్డుసభల నిర్వహణ తీరుపై సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన గ్రామ, వార్డుసభల వివరాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను అడిగి తెలుసుకున్నారు. ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అనుగుణంగా సభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మీ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఉత్సవాలు



కూచిపూడి నృత్యం చేస్తున్న కాకతీయ కళాక్షేత్రం కళాకారులు

7

### పకడ్బందీగా అర్హుల గుర్తింపు..



హరిదాస్‌నగర్‌లో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

8

## చదువుతో పాటు టాలెంట్ టెస్టుల్లో రాణించాలి : డీఈవో



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు నిర్వహించే వివిధ టాలెంట్ టెస్ట్‌ల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ ఇంగ్లీష్‌లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ అధ్వర్యంలో 8, 9వ తరతగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ అండ్ ఎలోక్యూషన్‌లో టాలెంట్ టెస్ట్‌లో గతంలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యారులకు డీఈవో బహుమతులను అందజేశారు. ఎంఈవో రఘుపతి, ఇంగ్లీష్‌లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు చేరాల తిరుపతి, ప్రధానోపాధ్యాయులు మంజులరాణి, సభ్యులు సదానందం, మీనాక్షి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

వేములవాడ కల్చరల్,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేశారు. రాజన్న ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 18 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీలు చేస్తూ మంగళవారం ఈవో వినోద్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. రాజన్న ఆలయంలో కొత్తగా జాయిన్ అయిన జూనియర్ అసిస్టెంట్ ఎన్.రాజును మహాశివరాత్రి సందర్భంగా ఇంజనీరింగ్ విభాగానికి తీసుకోగా, జి. లక్ష్మణ్ జూనియర్‌అసిస్టెంట్‌ను కల్యాణకట్ట-2కు, పందిళ్ల శ్రీనివాస్‌ను తిప్పాపూర్ గోశాల సూపర్‌వైజర్‌గా, బి. లక్ష్మారెడ్డి జూనియర్ అసిస్టెంట్‌ను మెయిన్ టెంపుల్‌కు, ఎన్. అనిల్ అనే జూనియర్ అసిస్టెంట్‌ను కల్యాణకట్ట-1కు బదిలీ చేయగా, ఎమ్. దేవయ్య అనే వాచ్‌మెన్‌ను తిప్పాపూర్ గోశాలకు, జి. శంకర్ అనే రికార్డు అసిస్టెంట్‌ను బద్ది పోచమ్మ ఆలయానికి, రికార్డు అసిస్టెంట్ పంపరి అంజయ్యను మెయిన్ టెంపుల్‌కు పోతారం శ్రీనివాస్, ఎమ్. వెంకటేష్ అనే జూనియర్ అసిస్టెంట్‌లను మెయిన్ టెంపుల్‌కు స్థానచలనం చేయగా, చంద్రమౌళిని అనే రికార్డు అసిస్టెంట్‌ను మెయిన్ టెంపుల్‌కు, సుశీల్ అనే జూనియర్ అసిస్టెంట్‌ను టీటీడీ ఎంక్వయిరీ ఆఫీస్‌కు, టీ. అజయ్ అనే జూనియర్ అసిస్టెంట్‌ను మెయిన్ బుకింగ్ కేంద్రానికి, ఆర్. దేవయ్య అనే అటెండర్‌ను లక్ష్మీగణపతి వసతగృహానికి, జి. దేవయ్య అనే వాచ్‌మెన్‌ను లక్ష్మీగణపతి వసతిగృహానికి, కే. సుధ అనే స్వీపర్‌ను మెయిన్ టెంపుల్‌కు, లత అనే అటెండర్‌ను బద్దిపోచమ్మ ఆలయానికి, నిర్మల అనే స్వీపర్‌ను అభిషేక మండపానికి బదిలీ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీచేశారు.

## బధిర విదార్థిని ఉన్నత చదువులకు ప్రభుత్వ సాయం..



లహరికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బధిర విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాభ్యాసాన్ని అందించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించి భరోసా కల్పించిందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన దొమకొండ లహరి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బధిర పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. ఉన్నత చదువు కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చొరవ తీసుకొని వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, ప్రభుత్వం నుంచి రూ.లక్షా 40వేలు మంజూరు చేసింది. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ మంగళవారం లహరికి చెక్కును అందజేశారు.

## అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా వైద్యాధికారి రజిత**



బొప్పాపూర్‌లో వైద్య సిబ్బంది సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. బొప్పాపూర్‌లోని పీహెచ్‌సీలో రికార్డులు, మందులు, వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులను అందించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీర్నపల్లిలో నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ నిర్వహణకు అద్దె భవనాన్ని పరిశీలించారు. వసతులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందా..?అని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, సరియాఅంజుమ్, తదితరులు ఉన్నారు.

- అందని బీమా పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని స్త్రీనిధి అధికారులు

# 'పశురక్ష'.. ఏది?

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు మృత్యువాత పడితే బీమా పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం పశురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో బీమా పరిహారం అందక పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలతో కొన్న పశువులు మృతి చెందడంతో పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్వశక్తి మహిళలకు డెయిరీ నిర్వహణలో భాగంగా పాడి పశువుల కొనుగోలుకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. పశువులు కొన్నప్పుడే బీమా చేయిస్తున్న అధికారులు అవి మృతి చెందితే పరిహారం అందించడం లేదు. ఇటు పరిహారం అందక, పశువులు మృతి చెందినా రుణం చెల్లించాల్సి వస్తుండడంతో వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**● రూ. 92 వేల రుణం**

స్త్రీనిధి ద్వారా మహిళలకు పాడి పశువుల కొనుగోలుకు 92,462 రూపాయల రుణం అందజేస్తున్నారు. ఇందులో నుంచి బీమాకు 827 రూపాయలు మినహాయించుకుంటున్నారు. ఈ రుణాన్ని మహిలలు 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలంలో మండలంలోని తాటిపల్లి, లంబాడిపల్లి, తక్కళ్లపల్లిలో పదికిపైగా పాడి పశువులు వివిధ కారణాలతో మృతి చెందాయి. బీమా కింద ఒక్కో దానికి 75 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాల్సి ఉంది. ఆ మొత్తం ఇంత వరకు లబ్ధిదారులకు అందలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**● నిర్లక్ష్యమే కారణమా..**

మూగజీవాలు మృతి చెందిన నెల రోజుల్లోగా బీమా పరిహరం కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మండలంలో మాత్రం నెల దాటిన తరువాతే క్లెయిమ్ పత్రాలు పంపించడంతోనే పరిహారం అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. తమకు పరిహారం అందక పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు**

- మిట్టపల్లి సుశీల, తాటిపల్లి

బీమా పరిహరం చెల్లించకుండా అధికారులు లేనిపోని ఇబ్బందులు పెడుతున్నారు. జీవాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తగిన ఆధారాలు చూపినా పట్టించుకోవడం లేదు. అధికారుల చుట్టు తిరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

**స్త్రీ నిధి అధికారులకు నివేదించాం**

- జీసీ రాజయ్య, ఏపీఎం, ఐకేపీ

మృతి చెందిన పశువుల క్లెయిమ్‌లకు చెందిన పత్రాలను స్త్రీనిధి అధికారులకు పంపించాము. పశువుల మృతిపై అధికారుల అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంటుంది. క్లయిమ్ పత్రాలను పంపించడంలో జాప్యానికి మాకు సంబంధం ఉండదు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డు'కట్ట'



నగునూర్ శివారులోని వాగు వద్ద తవ్విన కందకం

కరీంనగర్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ శివారులోని వాగులో ఇసుక అక్రమ రవాణాకు గ్రామ పంచాయతీ సిబ్బంది అడ్డుకట్ట వేశారు. మూడు రోజులుగా అర్ధరాత్రి సమయంలో కరీంనగర్ పట్టణానికి చెందిన ట్రాక్టర్లు వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాయి. అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతుండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం వేకువజామున ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. వాగు రహదారి వెంట కందకాలు తవ్వారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినట్లయింది.

## 30న కోరుట్లలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ కార్మిక సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీన కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలు కొరకు బీడీ కార్మిక ప్రదర్శన క్షేత్రంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై ప్రవేశపెట్టిన జీఎస్‌టీని రద్దు చేసి కనీస పెన్షన్ రూ.5,000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘ నాయకులు కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, మునుగురి హన్మంత్, ఎన్నం రాధ, మహేష్, ఎండి ముక్రం, ఎండి మౌలానా, ఎండి ఉస్మాన్, రామిల్ల రాంబాబు, సాయిఈశ్వరి, బాలే పద్మ, బేతి జ్యోతి, బొల్లె లక్ష్మీరాజం, కిరణ్, అందే వంశీ కృష్ణ, సమీర్ తదితరులు ఉన్నారు.

## వరకట్న వేధింపుల కేసు నమోదు

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన భర్త నిత్యం డబ్బుల కోసం వేధిస్తూ దాడి చేయడంతో భార్యకు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన పొలవేని జయకృష్ణ తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్య నివేదితను నిత్యం వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి జయకృష్ణ తన భార్యను కొట్టడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉదయం పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మెట్‌పల్లి శివారులోని వట్టి వాగు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ లారీ డ్రైవర్ షేక్ అజాం, లారీ యాజమాని ఎండి అజార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పూడూర్ గ్రామ శివారులో జడపర్శరాములు వ్యవసాయ భూమిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కొడిమ్యాల ఎస్సై ఫోన్: 8712656831, మల్యాల సీఐ ఫోన్. 8712656818 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

### స్కూటీలో మంటలు

మంథని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో ప్రమా దవశాత్తు స్కూటీలో మంటలు చెలరేగాయి. 8వ కాలనీకి చెందిన తగరం లింగయ్య, భార్య సమ్మక్కలు మంగళవారం స్కూటీపై మంథనికి వస్తుండగా కాయలు కాలిపోయి మంటలు వ్యాపించాయి. వారి వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారులు గమనించి అప్రమత్తం చేయడంతో వారు రోడ్డు పక్కకు నిలిపారు. మంటలను హెచ్‌పీ పెట్రోల్ పంప్ సిబ్బంది ఆర్పివేశారు.

### బావిలో పడి వృద్ధుడి మృతి

జగిత్యాలరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన ఈదుల రామయ్య(86) అనే వృద్ధుడు మంగళవారం ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిధిలో పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను గుర్తించి అప్పగించినట్లు టూటౌన్ సీఐ ప్రసాద రావు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వారి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని గుర్తించి బాధితులకు అందజేసినట్టు సీఐ తెలిపారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టర్‌లో నమోదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. ఫోన్లు ట్రాప్ చేసి బాధితులకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుల్ సాయిని సీఐ అభినందించారు.

### పోలీసుల అదుపులో గంజాయి సేవిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో గంజాయి సేవిస్తున్న విద్యార్థులను మంగళవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని కొందరు విద్యార్థులు కలిసి పల్లె ప్రకృతి వనంలో గంజాయి తాగుతుండాన్ని గమనించిన పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దాంతో ఐదుగురు విద్యార్థులు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయారు. మిగిలిన విద్యార్థులను అదుపులోని తీసుకుని ఠాణాకు తరలించారు. విచారణ జరుపుతున్నామని పోలీసులు వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## చొప్పదండిలో పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి వద్ద విలపిస్తున్న రైతు కుటుంబం

చొప్పదండి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో మార్కెట్ రోడ్డులో ఒక ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రైతు బండారి బీరయ్య తన ఇంట్లో నిల్వ చేసిన 30క్వింటాళ్ల పత్తి దగ్ధం అయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయగా దాదాపు రెండు లక్షల 50వేల విలువగల పత్తి కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహూతికావడంతో రైతు కుటుంబం కంటతడి పెట్టింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. తమని ఆదుకోవాలని రైతు అధికారులను కోరారు.

## యువకుడి మృతి ఘటనలో నిందితుల అరెస్ట్

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు యువకులపై విచక్షణారహితంగా దాడి చేసి ఒకరి మృతికి కారణమైన సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఈనెల 15వ తేదీ వేకువజామున వేముల వాడ పట్టణానికి చెందిన కోగిల నాగేష్, గుగులోతు రాకేష్, ఎడవల్లి హర్షిక్, వంగల మంజునాథ్‌లు మద్యం మత్తులో ఏసుకూరి రాజేందర్, దుర్గం శంకరయ్య అనే వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేశారని, దాడిలో తీవ్రంగా గాయపడిన రాజేందర్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. రాత్రి వేళల్లో జులాయిగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్మ ఇంటికి రాలేదని

## బాలుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి ఇంటికి రాలేదని కలత చెందిన ఓ ఎనిమిదేళ్ల బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాలో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పారిశుధ్య కార్మికుడు సంతోష్-పూర్ణ దంపతులకు రిత్విక్, దీక్షిత్ ఇద్దరు కొడుకులు. ఈ నెల 20న సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని సంతోష్ మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాత్రి సంతోష్ దంపతులు ఆసుపత్రిలోనే ఉండిపోగా, మంగళవారం ఉదయమే సంతోష్ గ్రామానికి వెళ్లాడు. అనంతరం పంచాయతీ విధులు నిర్వహించేందుకు సంతోష్ వెళ్లిపోగా, ఆలస్యంగా నిద్రలేచిన పెద్ద కొడుకు రిత్విక్ తల్లిదండ్రులు రాలేదని భావించాడు. కలత చెంది చీరతో ఉరి వేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన చిన్న కొడుకు దీక్షిత్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రిత్విక్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

### రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

చొప్పదండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాయలంలో జాతీయ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ పడాల రాహుల్ హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి మాసంలో దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రమాదాలను నియంత్రించే బాధ్యత వాహనదారులపైనే ఉంటుందని అన్నారు. ఆర్‌టీఏ నియమ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐ హరిత, రిటైర్డ్ డీడీవో జైపాల్, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ● కలెక్టరేట్ వరకు పాదయాత్ర, ధర్నా**




కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించడంతో పాటు ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్‌లకు నెలకు రూ. 18వేల వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు అశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు నాలుగు కిలోమీటర్లు పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర అరోగ్యశాఖ మంత్రితోపాటు కమిషనర్‌లకు వినతి పత్రం పంపించాలంటూ కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్‌లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతలతో వారి సమస్యలను పరిష్కరించాలని అలాగే వారికి ఫిక్స్‌డ్ వేతనాలను అందించాలని 2023 సంవత్సరంలో సెప్టెంబర్ 25 వతేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మెలో భాగంగా హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్‌లు చేపట్టిన ధర్నాలో అనాటి హెల్త్ కమిషనర్ శ్రీనివాస రావు రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశావర్కర్‌ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఫిక్స్‌డ్ వేతనాలను అసెంబ్లీ సమావేశాలల్లో తీర్మాణించి నిర్ణయించాలని కోరారు. ఆశా కార్యకర్తలు సమస్యలపై ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదావేణి మంజుల, జిల్లా గౌరవ అధ్యక్షురాలు భారతి, గాయత్రి, చంద్రకళ. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### దొంగకు మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లిలోని పెద్దమ్మగుడిలో చోరీకి పాల్పడిన కేసులో వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలోగల పెద్దమ్మగుడిలో చొరబడిన దొంగ మే 4, 2024న పుస్తెమట్టెలు ఎత్తుకెళ్లాడు. ఈ దొంగతనంపై ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామచంద్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శేఖర్‌రెడ్డి కేసు నమోదుచేసి దొంగతనం చేసిన శివరాత్రి సంపత్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఎస్ఐ గణేశ్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ వాదించగా, కోర్టు మానిటరింగ్ అధికారి రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ అడేపు దేవేందర్‌లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

ముత్తారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన కూరాకుల సాయికుమార్ (22) ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం దక్కలేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ మూడేళ్లుగా ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రయత్నం చేస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో ఉద్యోగాలు వచ్చినట్టే వచ్చి చేజారి పోతున్నాయని మనస్తాపం చెందేవాడు. ఈనెల 16న పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

### డబ్బులు ఇప్పిస్తానని మోసం..

**● వృద్ధ దంపతుల నుంచి రూ.3వేల వసూలు**

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఓ వృద్ధ దంపతుల వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు రూ.3 వేలు వసూలు చేసి పారిపోయిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని అక్కపల్లికి చెందిన వృద్ధ దంపతులు అమృత-మల్లయ్యలు పనినిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న దంపతుల వద్దకు బైక్‌పై వచ్చి గుర్తు తెలియని వ్యక్తి, మహిళ ఆగారు. మీకు రూ.50 వేలు ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. మల్లయ్య వద్ద ఉన్న రూ.3.వేల నగదును వసూలు చేసి వెళ్లిపోయారు. జరిగిన విషయం చుట్టుపక్కల వారితో పాటు కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు మోసగించారని పేర్కొన్నారు. దాంతో వృద్ధ దంపతులు లబోదిబోమన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని వృద్ధ దంపతులు పేర్కొన్నారు.

### రూ.80వేల నగదు, బైక్ అపహరణ

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఓ వైన్స్ షాపు వద్ద నిలిపిన బైక్‌తో పాటు ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.80 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సయ్యద్ జావీద్ తన బైక్‌పై గొల్లపల్లి గ్రామ శివారులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లి వాహనాన్ని నిలపాడని పేర్కొన్నారు. అతడు తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు వాహనంతో పాటు ట్యాంకు కవర్లలో ఉన్న రూ.80వేల నగదును ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

చున్నీ బైక్‌లో చిక్కుకుని

### మహిళ మెడకు గాయాలు

గన్నేరువరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మెడలోని చున్నీ ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఇరుక్కొని మహిళ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి పర్శరాం తన కూతురు ప్రసన్నతో కలిసి మండలంలోని మాదాపూర్ నుంచి గన్నేరువరం ద్విచక్రవాహనంపై వస్తుండగా ఖాసింపేట మార్గమధ్యలో మెడలో ఉన్న చున్నీ వాహనం వెనక టైర్‌లో చిక్కుకొని చున్నీ మెడకు బిగుసుకుపోవడంతో ప్రసన్న కిందపడిపోయింది. దీంతో ప్రసన్న మెడకు తీవ్ర గాయం అయింది. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ సాయిప్రేమ్ మెడ చుట్టూ చుట్టుకున్న చున్నీని తొలగించి పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో బాధితురాలిని ఎక్కించుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్ సాయిప్రేమ్‌ను ఎస్ఐ తాండ్ర నరేష్, సీఐ కర్రె స్వామి అభినందించారు.

### అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ అరెస్ట్

**● రూ. 10లక్షల చిట్టి డబ్బులు ఎగవేతతో కేసు నమోదు**

సైదాపూర్, జనవరి 21: అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన ఊసకోయిల వెంకటపతి అనే వ్యక్తి అక్షర చిట్‌ఫండ్‌లో రూ. 10లక్షల చిట్టి వేశాడు. చిట్టి గడువు తీరినప్పటికీ అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు చిట్టి డబ్బులు ఇవ్వడం లేదు. దాంతో వెంకటపతి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చిట్‌ఫండ్ యజమానులు గడువు తీరిన చిట్టీల డబ్బులు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం

### నిందితుడికి మూడు సంవత్సరాల జైలు

భీమారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తికి కోర్టు మంగళవారం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మండలంలోని రాగోజీపేట గ్రామానికి చెందిన రాపెల్లి నగేష్‌కు నిజామాబాద్ జిల్లా పిప్పరి మండలం భీంగల్ గ్రామానికి చెందిన ఎగోలం మనోజ్ కుమార్‌తో దుబాయ్‌లో పరిచయం ఏర్పడింది. మనోజ్ దగ్గర దుబాయ్‌కు చెందిన అలికో కంపెనీ వీసాలు ఉన్నాయని నమ్మించి రాపెల్లి నగేష్‌తో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు తీసుకుని నకిలీ వీసాలు ఇచ్చాడు. తమకు ఇచ్చిన వీసాలు నకిలీవని తెలుసుకున్న నగేష్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడు మనోజ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా కేసు విచారణలో భాగంగా కోరుట్ల జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పావని నిందితుడు మనోజ్ కుమార్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తులో నిందితుడిని శిక్ష పడేలా చేసిన ఏపీపీ ప్రణయ్ కుమార్, ఎస్సైలు శ్యామ్‌రాజ్, వెంకటేశ్వర్ రావు, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మహేశ్వర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

### అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 20న బడికి వెళ్లి వస్తున్న ఎనిమిదేళ్ల బాలికను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారని తెలిసింది.



సంగీత కచేరి నిర్వహిస్తున్న అనుపమ



కళాకారిణి ప్రదర్శన

### కొనసాగుతున్న
## త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాద బ్రహ్మ, లయ బ్రహ్మ సద్గురు శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కొనసా గుతున్నాయి. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమాన్ని నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు శ్రీత్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఉద యం 10 గంటలకు శిఖామణి హరికథను, ఉదయం 11.30 గంటలకు రాఘవేంద్ర తబలా సోలో కార్యక్రమాన్ని చేపట్టగా, సాయంత్రం 4.30 గంటలకు అనుపమ చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది.





తబలా వాయిస్తున్న కళాకారులు

# చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ..

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు శ్రీబద్ది పోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం తెల్లవారు జామునుంచే దర్శనానికి తరలివచ్చారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. పిల్లాపాపలు, పాడిపంటలను చల్లంగా చూడాలని అమ్మవారికి పట్నం వేసి, ఒడి బియ్యం పోసి నైవేద్యాన్ని సమర్పించారు. కళ్లసాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు క్యూలైన్లు త్వరగా కదిలేలా చర్యలు చేపట్టారు.



రద్దీగా మారిన బద్ది పోచమ్మ ఆలయం



**● అంజన్న సన్నిధిలో భక్తుల సందడి**

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

● అంజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యన్నదానం కోసం హైదరాబాద్ బాలనగర్‌కు చెందిన వై.దినేశ్‌రెడ్డి అనే భక్తుడు రూ.75వేలు అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్‌కు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

# ఎన్టీపీసీలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి

**● 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి**

**● ఆర్థిక సంవత్సరంలో 11 రోజుల ముందే పూర్తి**



జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ వేగంగా 350 బిలియన్ యూనిట్ల(బియు) విద్యుత్ ఉత్పత్తి మైలు రాయిని దాటింది. ఈ మేరకు ఎన్టీపీసీ అధికార వర్గాలు మంగళ వారం ప్రకటన విడుదల చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈనెల 20వ తేదీ నాటికి గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ రోజుల్లో 350 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జనవరి 31 నాటికి 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరుగగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 రోజులకు ముందే కేవలం 295 రోజుల్లోనే మైలురాయిని దాటడం విశేషం. దేశవ్యాప్తంగా థర్మల్, గ్యాస్, సోలార్, విండ్, జల విద్యుత్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ఎన్టీపీసీ 76.5 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగి ఉంది. దేశానికి నాల్గవ వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ అందిస్తోంది. రాష్ట్రంలో ఎన్టీపీసీకి చెందిన రామగుండంలో 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతోపాటు 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ), 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 10 మెగావాట్ల సర్ఫేస్ సౌర విద్యుత్ ప్రాజెక్టులు పని చేస్తున్నాయి.

### తలనీలాల టెండర్‌కు
## ముందుకు రాని కాంట్రాక్టర్లు..

**● వాయిదా వేసిన రాజన్న ఆలయ అధికారులు**

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రెండు సంవత్సరాలకు తలనీలాలు సేకరించుకునేందుకు మంగళవారం నిర్వహించిన టెండర్‌కు ఆదరణ కరువైంది. మంగళవారం 2025-27 సంవత్సరానికి టెండర్‌లను ఆహ్వానించారు. గత రెండేళ్లకు గాను ఇప్పటికే టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రస్తుత పరిస్థితులలో ధర ఎక్కువైందని చెప్పి స్వామివారికి నగదును చెల్లించకుండా మొండికేశాడు. అయితే ఈ ఏడాది మార్చి మాసం నాటికి సదరు కాంట్రాక్టర్ గడువు ముగుస్తుండగా, మూడు మాసాల ముందే రాజన్న ఆలయంలో తలనీలాలను సేకరించుకునేందుకు టెండర్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం టెండర్‌ను నిర్వహిస్తున్నామని రాజన్న ఆలయ అధికారులు పత్రికా ప్రకటన చేసినప్పటికీ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఆన్‌లైన్‌లో కూడా టెండర్లు ఎవరు దాఖలు చేయకపోవడంతో రాజన్న ఆలయ అధికారులు టెండర్‌ను వాయిదా వేశారు. అయితే మరోసారి నిర్వహిస్తామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

### ఎస్సారార్ కళాశాల
## డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్

గణేశ్‌నగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్, అటానమస్ కళాశాల యూజీ మూడో, ఐదో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బీఎస్సీ హానర్స్, బీసీఏ, బీబీఏ కోర్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడో సెమిస్టర్ లో 1215 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 646 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఐదో సెమిస్టర్‌లో 1197మంది విద్యార్థులకు 768 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. శీతీశ్భ్రుఖ్తుఝ్చుజి.ఛ్రొఝులో ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎండీలో నీరుండగానే పూడికతీత

**● ఈ నెలాఖరు వరకు టెండర్లు ఖరారు**

**● కొత్త ప్రయోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ) నిండా నీరు ఉండగానే కొత్త పద్ధతిలో పూడికతీత పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఎల్ఎండీ, మిడ్ మానేర్‌తోపాటు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో ఈ కొత్తపద్ధతిలో పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని స్థాపిత లక్ష్యానికి చేర్చాలని ప్రభుత్వం భావిస్తున్నది. వర్షాలు, వరదల కారణంగా ప్రాజెక్టుల్లోకి పూడిక వచ్చి చేరుతున్నది. యేటా వచ్చే ఈ పూడికతో నీటినిల్వ సామర్థ్యం క్రమేపి తగ్గిపోతున్నది.

**● పూడికతో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం**

ఎల్ఎండీని 24.034 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1985లో నిర్మించారు. డెడ్ స్టోరేజి లెవల్ 2.09 టీఎంసీలు కాగా, రిజర్వాయర్‌లో పూడిక పేరుక పోవడంతో కేవలం 1.9 టీఎంసీలు మాత్రమే డెడ్ స్టోరేజీలో ఉంటు న్నాయి. పూర్తి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేం దుకుగాను పూడిక తీత ఏకైక మార్గమని గుర్తించిన ప్రభుత్వం అందుకు సిద్ధమైంది. కొన్ని సంవత్సరాలుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడం, రిజర్వాయర్ల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోస్తుండడంతో ఎల్ఎండీ, మిడ్ మానేరు తదితర రిజర్వాయర్లు నిండుకుండలా ఉంటున్నాయి. నీరుండగానే పూడిక తీత చేపట్టేందుకు కొత్త పద్ధతిలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మ కంగా ఎల్ఎండీ, మిడ్‌మానేరు, కడెం ప్రాజెక్టుల్లో కొత్త పద్దతిలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టును ఖరారు చేసేందుకు టెండర్లు పిలిచారు. ఈనెల 21తో గడువు ముగిసింది. 27న టెక్నికల్ బిడ్ టెండర్లు తెరవనున్నారు. అనంతరం 30న ఫైనాన్షియల్ బిడ్ తెరచి కాంట్రాక్టును ఖరారు చేస్తారు. ఈ కాంట్రాక్టు 20 ఏళ్ల పాటు కొనసాగుతూ ఆయా ప్రాజెక్టులో పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉంటుంది. మూడు ప్రాజెక్టుల్లో కలిపి 4.26 కోట్ల టన్నుల పూడిక తీయనున్నట్లు చెబుతున్నారు. పూడికలో 25శాతం ఇసుక వచ్చే అవకాశం ఉన్నది. ఈ ఇసుకను టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి కాంట్రాక్టర్ వాటిని మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. దిగువ మానేరులో 131 లక్షల టన్నులు, మధ్య మానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయాలని నిర్ణయించారు. . మూడు ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులకు 1439.55 కోట్ల రూపాయల అంచనాతో కరీంనగర్ ఇరిగేషన్ ఎస్ఈ టెండర్లు పిలిచారు. దీనికి కరీంనగర్ ఇరిగేషన్ ఇఎన్‌సీ మోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తపద్ధతిలో పూడిక తీత విజయవంతమైతే ఇతర రిజర్వాయర్లలో కూడా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది.



ఎల్ఎండీ

### సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికి
## ప్రభుత్వం కట్టుబడి ఉంది..

**● మహిళశక్తి చీరల కోసం 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లు**

**● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

సిరిసిల్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం స్వశక్తి సంఘాలకు అందించే యూనిఫాం చీరల ఆర్డర్లు ఇచ్చి పెద్దఎత్తున పని కల్పించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో ఒక ప్రకటన జారీ చేశారు. స్వయం సహాయక సంఘాలకు అందించే ఇందిర మహిళ శక్తి పథకంలో భాగంగా అందరికి ఒకే రంగు గల ఒక్కొక్కరికి ఒక్కో చీర అందజేసేందుకు 4.24 కోట్ల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీలోపు ఈ చీరలు సిద్ధం కానున్నాయని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రభుత్వం సిరిసిల్లకు రూ.50 కోట్లతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ యూనిఫాంల కోసం మ్యాక్స్ సొసైటీలకు 65.67 లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్నా రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికుల సమస్యలను విస్మరించిందని, బకాయిలు కూడా చెల్లించకుండా నేత కార్మికులను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడించారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి మైథిలి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఇటీవల జరిగిన పోటీల్లో మైథిలి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మైథిలిని ప్రిన్సిపాల్ గంగాధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్స శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.



మైథిలి

## హైవోల్టేజీ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయొద్దు

రాయికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు గ్రామం నుంచి రాయికల్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయొద్దని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామం మధ్యలో నుంచి హైవోల్టేజీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ప్రమాదాలు ఏర్పడుతాయని రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సై సుధీర్ రావు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ ఏఈ నవీన్‌తో మాట్లాడారు. 11 కేవీ విద్యుత్ వైర్లకు దూరంగానే 33 కేవీ తీగలు ఏర్పాటు చేస్తున్నామని మహిళలకు నచ్చజెప్పడంతో నిరసన విరమింపజేశారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

## ఎన్‌వైకే ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగహన

గణేశ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువతకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ మంది యువకులు గాయాలబారిన పడుతున్నారని తెలిపారు. యువత ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని వ్యాహనాన్ని జాగ్రత్తగా నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, కారులో వెళ్తే తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ బ్లూటూత్ పెట్టుకుని పాటలు వింటూ వాహనాలను నడిపితే ఏకాగ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం వెంకట్ రాంబాబు, ప్రోగ్రామ్ అధికారి బసవపత్రి రవీందర్, పబ్లిక్‌రిలేషన్‌అధికారి మలహర్‌రావు పాల్గొన్నారు.




రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌వైకే సభ్యులు

# అక్షరాలే ఉపాధి

**● పుట్టుకతోనే దివ్యాంగుడు**

**● ఉపాధిహామీ బోర్డులు, గడపలకు డిజైన్లు వేస్తూ బతుకుదెరువు**



ఉపాధిహామీ బోర్డులపై అక్షరాలు రాస్తున్న రాజయ్య

పెద్దపల్లి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బొంకూరి రాజయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. కుడి చేయి కాలు, చేయి పని చేయకపోయిన ఒంటి చేత్తో బతుకు బండి లాగిస్తున్నాడు. అక్షరాలనే నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజయ్య డిగ్రీ వరకు చదువుకొని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. కొన్ని రోజులు ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. కుటుంబానికి సరిపడ ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో 15 ఏళ్ల క్రితం ఎడమ చేతితో గడపలపై రంగులతో ముగ్గులు వేయడం ప్రారంభించాడు. అనంతరం పలువురి సలహాతో ఈజీఎస్‌కు సంబంధించిన పనులు, నిధుల వివరాలను సూచించే బోర్డులు రాస్తూ ఉపాధి పొందుతున్నాడు. పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నేమ్ బోర్డులు రాస్తున్నాడు. భార్య కూలీ చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది.

**ఉపాధి కల్పించండి**

ఆర్థిక పరిస్థితుల వల్ల కుటుంబంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రస్తుతం ఆర్టిస్ట్‌గా జీవనాన్ని సాగిస్తూ కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. ప్రభుత్వం ద్వారా అందే పింఛన్ డబ్బులు, ఆర్ట్ ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నా. ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలి.

**- బొంకూరి రాజయ్య, గౌరెడ్డి పేట, ఆర్టిస్ట్**



# పకడ్బందీగా అర్హుల గుర్తింపు..

- రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి


గ్రామ సభలో పాల్గొన్న జడ్పీ సీఈవో


అనుపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేష్‌కుమార్


జైసేవాలాల్ ఊరు తండాలో కొనసాగుతున్న సభ

తంగళ్లపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం అర్హుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం తంగళ్ళపల్లి మండలం గండిలచ్చపేటలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు. అలాగే మండలంలోని అంకిరెడ్డిపల్లె, జిల్లెల్ల, మల్లాపూర్, తాడూరు, తంగళ్ళపల్లి, చీర్లవంచ , పాపయ్య పల్లె గ్రామాల్లో గ్రామసభలో నిర్వహించారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలోని హరిదాస్‌నగర్, అగ్రహారం, నారాయణపూర్, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, గుంటపల్లిచెరువు తండాల్లో అధికారులు ప్రజా పాలన గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. హరిదాస్‌నగర్‌లో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ హాజరై మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, ఏఎంసీ చైర్మన్ సబేరాబేగం, క్లస్టర్ అధికారులు రామచంద్రం, సత్తయ్య, కవిత, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : రోడ్డు విస్తరణలో సర్వం కోల్పోయిన తమకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వ పథకాలను ఎందుకు కేటాయించలేరని ప్రజలు వీర్నపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో నిరసనకు దిగారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను నిలదీశారు. పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులను శాంతింపజేశారు. సభ తిరిగి ప్రారంభమైన కొంత సమయానికే ప్రజలు కొందరికే ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేశారంటూ ఆగ్రహించారు. దాంతో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ సభ కొనసాగుతుండగానే వెనుదిరిగారు. మండలంలోని అడవిపదిర, బంజేరు, మద్దిమల్ల, బాబాయిచెరువుతండా, సీతారాంనాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్‌తండాలో గ్రామ సభలు నిర్వహించారు. క్లస్టర్ అధికారులు రాందాస్, మారుతిరెడ్డి, వాజీద్, జయ, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● సిరిసిల్ల : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో సంక్షేమ పథకాలకు సంబంధించిన జాబితా వెల్లడించడానికి, దరఖాస్తులు స్వీకరించే దిశగా ఏర్పాటు చేసిన వార్డు సభలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య మాట్లాడారు.వార్డుకౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామసభలు ఇల్లంతకుంట, జంగమరెడ్డిపల్లె, అనంతగిరి, ఆరెపల్లి, గాలిపెల్లి, ఒబులాపూర్, గూడెపుపల్లి, అనంతారం, జవారిపేట గ్రామాలలో జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ప్రత్యేకాధికారులు శశికళ, రమేష్, సురేష్‌రెడ్డి, రాజేష్, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్, కూనబోయిన బాలరాజు, మామిడి రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని మర్రిగడ్డ, మూడపల్లి, రామన్నపేట సనుగుల, అనంతపల్లి, దేవునితండా, ఏనగల్ గ్రామాల్లో గ్రామ సభలను మంగళవారం అధికారులు నిర్వహించారు. మూడపల్లి లో ఐదు సంవత్సరాల క్రితం తన భర్త లస్మయ్య చని పోతే అధికారులు తాను చనిపోయినట్లుగా రేషన్ కా ర్డులో నుంచి (సత్తవ్వ) పేరు తొలగించారని, అప్పటి నుంచి తనకు బియ్యం రాలేదని తెలిపింది. తన భర్త లక్ష్మయ్య పేరు తొలగించి, తన పేరుపై రేషన్ కార్డు ఇప్పించాలని కోరింది. ఎనగల్‌లో మాజీ ఉపసర్పంచ్ జనార్ధన్ మాట్లాడుతూ కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చిన వారికి రైతు భరోసా ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. మండల ప్రత్యేక అధికారి జిల్లా పశు వైద్యాధికారి వి. రవిందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్చార్జి ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి దుర్గరాజు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలం ఆరెపల్లి, సంకెపల్లి, అనుపురం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. వేములవాడ మండలం అనుపురంలో తమ గ్రామాలు ముంపునకు గురై తమకు వ్యవసాయ భూములు లేకుండా పోయా యని సభ దృష్టికి తీసుకువచ్చారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని ఫాజుల్‌నగర్, తుర్కాష్‌నగర్, బొల్లారం, లింగంపల్లి, అచ్చన్నపల్లి, బాలరాజుపల్లి గ్రామాలలో అధికారులు ప్రజాపాలన గ్రామసభలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, పలువురు అధికారు లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ప్రజా పాలన దరఖాస్తు చేసుకున్న వారిలో సంక్షేమ పథకా ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగాయని మం డలంలోని చీకోడ్, చిప్పలపెల్లి, మోత్రాపూర్, సేవాలా ల్‌తండా, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలను తహసీల్దార్ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీలత, తహసీల్దార్ సురేశ్, కార్యదర్శి బాలకిషన్, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డైరెక్టర్ కొండల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రమేశ్,మాజీ సర్పంచ్ రజిత సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మం గళవారం జగదాంబ తండా, మల్లుపల్లె, లక్ష్మీపూర్, పొన్నాలపల్లె, రాజుపేట, కోళ్ళమద్ది గ్రామాల్లో అధికారులు సభలను నిర్వహించారు. ప్రధానంగా గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల అంశా లను ప్రజలు ప్రస్తావించారు. తహసీల్దార్ భూప తి, ఎంపీడీవో రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయతిరుపతి, ఎంపీవో రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ తహీల్దార్ అపర్ణతో పాటు ఇతర అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలంలో అధికారులు మంగళవారం 8 గ్రామాల్లో ప్రజా పాలనలో భాగంగా గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోనరావుపేట మండల కేంద్రంలో పలువురు గ్రామస్థులు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అధికార పార్టీ నాయకులకి వచ్చాయని నిలదీశారు. ఈ సమావేశాల్లో మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రాజేశ్వర్, తహశీల్దార్ విజయ్ ప్రకాశరావు, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు రాజశేఖర్, రజిని, ఏవో సందీప్, క్లస్టర్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని రత్నంపేట, దేశాయిపల్లి, రామన్నపేట, గుండన్నపల్లి, దుండ్రపల్లి, కొత్తపేట గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో రుణమాఫీ కానీ రైతులు అధికారులు ప్రశ్నించారు. దేశాయిపల్లి జరిగిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల, ఏవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేసిన గ్రామాల్లో తొలగించిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వం తీసుకున్న భూములకు నష్టపరిహారాన్ని అందించాలం టూ ప్రజలు అందోళన చేపట్టారు. సిరిసిల్ల మున్సిపాల్టీ పరిధిలోని 8వ వార్డు పెద్దూర్, 9వ వార్డు సర్ధాపూర్ గ్రామాల్లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా, ఇందిరమ్మఇళ్ల, కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజా పాలన వార్డు సభలను ఏర్పాటుచేశారు. స్పెష ల్ అధికారి రాధాబాయ్, టౌన్‌సీఐ కృష్ణ, కౌన్సిలర్‌లు చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయా వార్డులో ప్రజాపాలన సమావేశాల్లో ప్రజలు చేసుకున్న ధరఖాస్తుల అధారంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలతో పాటు రైతుభరోసాకు ఎంపిక, తొలగించిన వారి వివరాలను అయా శాఖల అధికారులు చదివి వినిపించా రు. అభ్యంతరాలను ఉంటే తిరిగి ధరఖాస్తులు చేసుకోవాలని అలాగే ధరఖాస్తులు చేసుకున్న లిస్టలల్లో పేర్లు రానీ వారికి తిరిగి ధరఖాస్తులుచేసుకోవాలని స్పెషల్ అధికారి రాధాబాయ్ కోరారు. వ్యవసాయాధికారి సందీప్ కుమార్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిలదీతలు.. నిరసనలు

(5వ పేజీ తరువాయి)

చేసుకోవాలని ప్రజలకు సూచనలు చేశారు. కోనరావుపేటలో కాంగ్రెస్‌కు చెందిన వాళ్లనే అర్హులుగా గుర్తించారని అసలైన వారికి అన్యాయం జరిగిందని ప్రశ్నించారు. చందుర్తి మండలం మూడపల్లిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో పేర్లు లేకపోవడాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లస్మవ్వ అనే వృద్ధురాలు తన భర్త ఐదు సంవత్సరాల క్రితం చనిపోయాడని అతని వేలిముద్ర వేస్తేనే రేషన్ ఇబ్బంది పెడుతున్నారని గ్రామసభలో ప్రశ్నించారు. బోయినపల్లిలో గ్రామసభల్లో రుణమాఫీ కాలేదని ఎప్పుడు చేస్తారంటూ రైతులు ప్రశ్నించారు. వేములవాడ అర్బన్ మండలంలో ముంపు గ్రామాల ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రశ్నించారు. తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భూముల కోల్పోయామని ఉపాధిహామీలో జాబ్‌కార్డులు లేకపోవడంతో ఆత్మీయ భరోసాకు దూరం చేశారని ప్రశ్నించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలోని పది వార్డుల్లో సభలు జరిగాయి. ఇళ్లు ఉన్నవారికే మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశారని ప్రశ్నించారు. రేషన్ కార్డులు లేవని, మున్సిపల్ పరిధిలోని విలీనగ్రామాల్లో ఉపాధిహామీ పథకాన్ని అందించాలని కోరారు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు ఇస్తామన్న భూములు ఇవ్వాలని కోరారు. వేములవాడ మున్సిపాలిటీల్లో 8 వార్డుల్లో సభలు నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ వార్డు సభల్లో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, తంగళ్లపల్లి గ్రామసభలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వీర్నపల్లిలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్‌లు జిందం కళచక్రపాణి, గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల సభ్యులు, కాంగ్రెస్ నాయకుల హడావిడి కనిపించింది.

### ● నిఘా నీడలో సభలు...

జిల్లాలో సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేసే దిశగా క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, గ్రామసభలు నిర్వహణ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం చేపట్టినా మొక్కుబడిగానే సాగిందనే విమర్శలు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిఘా నీడలో గ్రామసభలు కొనసాగాయి. సభల వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు సీఐలు, ఎస్‌ఐలు పర్యవేక్షించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 1,05,466 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన స్వంత స్థలం ఉన్నవారి పేర్లను చదివారు. జిల్లాలో రేషన్ కార్డులకు సంబంధించి గతంలో ప్రజాపాలన సమయంలో 40 వేల దరఖాస్తులు రాగా, 9,731 దరఖాస్తుల జాబితాలనే గ్రామసభలకు తీసుకవెళ్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కూలీలను 11,485 మందిని గుర్తించారు. ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల మంజూరు పక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రకటించినా మళ్లీ ఎప్పుడు అవకాశం ఇస్తారో తెలియక గ్రామస్థులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### నేడు గ్రామసభలో పాల్గొననున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం

జిల్లాలోని రుద్రంగి మండల కేంద్రంలో రెండవ రోజు బుధవారం జరిగే గ్రామసభకు నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు పాల్గొననున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సభ ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీప్యాడ్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకు రుద్రంగి గ్రామసభలో పాల్గొన్న అనంతరం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో కళికోట సూరమ్మ చెరువు రిజర్వాయను సందర్శిస్తారని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ తెలిపారు.

## ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి..


మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 2 1(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. చెక్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూరల్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో వెళ్లడం ప్రమాదకరమని అన్నారు. మైనర్ విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదానికి కారణమైతే వారి తల్లిదండ్రులు సైతం శిక్షార్హులు అవుతారన్నారు. మండల విద్యాధికారి కిషన్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని విజ్ఞానవర్ధినీ పాఠశాలలో రోడ్డు భద్రత ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు గురైతే మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా కృంగదీస్తుందని, అందుకే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

● ఇల్లంతకుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డుభద్రతా నియమాలు తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి అమూల్యమైన జీవితాలను కోల్పోవద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ దేవరాజంతో పాటు అధ్యాపకులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు దుమాల గ్రామంలో ప్రైవేటు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై మంగళవారం ఎస్‌ఐ రమాకాంత్ అవగాహన కల్పించారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్సై ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాహుల్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రికి ఆహ్వాన పత్రికను అందించిన అయ్యప్ప భక్తులు


ఆహ్వాన పత్రికను అందిస్తున్న అయ్యప్ప భక్తులు

ఇల్లంతకుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మండలంలోని అయ్యప్ప స్వాములు మంగళవారం ఆహ్వాన పత్రికను అందించారు. మండల కేంద్రంలో ఫిబ్రవరి 3 నుండి అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా కరీంనగర్‌లో కేంద్ర మంత్రిని కలిసి ఉత్సవాలలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు బిల్ల రఘు, మంద చక్రాధర్‌రెడ్డి, ఈదుల రవీందర్‌రెడ్డి, ఎర్రోజు సత్యం, కట్ట ఎల్లారెడ్డి, బొల్లం వెంకటేశం, నాగరాజు, ప్రదీప్, నాగసముద్రాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



వేములవాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం రాష్ట్ర సభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, మల్లారపు ప్రశాంత్ కోరారు. సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంగళవారం వేములవాడ పట్టణంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో జరగనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నగేష్, సాయి భరత్, శివ, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అరుణ్‌కుమార్ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రాజ ఎల్లయ్య, మనోజ్, అంజయ్య, దేవయ్య, వెంకటి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో గదులను శుభ్రం చేసిన విద్యార్థులు


గదులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు కేటాయించిన గదులను ప్రధానోపాధ్యాయుల ఆదేశాల మేరకు విద్యార్థులు శుభ్రం చేస్తున్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై డీఈవో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సన్నాహక సభ విజయవంతం చేయండి

కోనరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్షల డప్పులు, వేల గొంతులు సభను విజయవంతం చేయాలని నిమ్మపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మనోజ్ కోరారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బహిరంగ సభను విజయవంతానికి ఈనెల 24న మండలంలోని మరిమడ్లలో సన్నాహక సభను నిర్వహిస్తున్నామని, ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రె సుధాకర్ మాదిగ, డప్పుల భాస్కర్ మాదిగ, మల్యాల మధుకర్ మాదిగ, సామి మాదిగ, శాంతి మాదిగ, కార్తీక్ మాదిగ, తిక్కల శేఖర్ మాదిగ, అక్కనపల్లి శేఖర్ మాదిగ, కుమ్మరి వేణు మాదిగ, కడకుంట్ల దీపక్ మాదిగ, దప్పుల దినకర్ మాదిగ, డప్పుల సంతోష్ మాదిగ పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం

వేములవాడ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బుర్ర శేఖర్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. మండలంలోని చింతలఠాణకు చెందిన బీజేపీ కార్యకర్తలు, యువకులు రాజన్న ప్రసాదాన్ని అందజేసి సన్మానించారు. గంట మహేష్, అంజనేయులు, మధు, మహేష్, ప్రశాంత్, కళ్యాణ్, శంకర్, లక్ష్మణ్ ఉన్నారు.

### ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సిరిసిల్ల రూరల్, జనవరి 21 (అంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి నెలలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మంద అనిల్, మలారపు ప్రశాంత్‌లు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, జాలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా నాయకులు పెండేల అదిత్య, దినకర్, మదన్, ముబారక్, రాము, సురేష్, అజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### మోసం చేయడానికే గ్రామసభలు

ఇల్లంతకుంట, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఆరుగ్యారంటీలపై ప్రజలు నిలదీస్తున్నందునే గ్రామసభలు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన కాంగ్రెస్ నాయకులు కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. పోలీసుల బందోబస్తు మధ్య గ్రామసభలు నిర్వహించడం చూస్తుంటే ప్రభుత్వ వైఖరి అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు.

### పెట్రోల్, డీజిల్ కొరత తీర్చాలి

కోనరావుపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం అందుబాటులో ఉండాలని ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొరత వారం రోజులుగా ఉందని, వెంటనే కొరతను తీర్చాలని పలు గ్రామాలు రైతులు కోరుతున్నారు. సుద్దాల పెట్రోల్ బంకు వద్ద రైతులు మాట్లాడుతూ సుద్దాల రైతు సేవ కేంద్ర పెట్రోల్ బంకులో తరచుగా డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడుతోందని, యజమాన్యం తీర్చాలని కోరారు.

### ఆర్థిక సాయం

చందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల గోరుముద్ద కార్యక్రమం నిర్వహణ కోసం కాంగ్రెస్ నాయకులు పదివేల రూపాయలు ఆర్థికసహాయం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శంకర్ ఆర్థిక సహాయం అందజేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సత్తయ్య ప్రభాకర్, నారాయణ. చంద్రం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

గంభీరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల వనరుల కేంద్రం ఎదుట మంగళవారం టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. భార్యభర్తల బదిలీలు చేపట్టినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్ భానోత్ వర్జున్, మండల అధ్యక్షుడు చిట్టంపల్లి బాలకిషన్, ప్రధాన కార్యదర్శి ముత్తయ్యగారి నాగరాజు, జిల్లా కౌన్సిలర్ గంధ్యాడపు శ్రీనివాస్, మండల బాధ్యులు గుడికాడి కొమురయ్య తదితరులు ఉన్నారు.

### అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా శంకర్

చందుర్తి జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండపల్లి గ్రామ అంబేద్కర్ మాదిగ యువజన సంఘం అధ్యక్షులుగా మహంకాలి శంకర్ ఎన్నుకున్నారు. ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కుమ్మరి దయాకర్, కోశాధికారిగా కుమ్మరి అనిల్, కార్యవర్గసభ్యులుగా మల్యాల నర్సయ్య, మహంకాలి లచ్చయ్య, గసికంటి శశి, కుమ్మరి రాములు, లింగంపల్లి మల్లేశంలను ఎన్నుకున్నారు. నాయకులు మల్యాల గంగ నర్సయ్య, కుమ్మరి రాములు, లచ్చయ్య, బింగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు రుచికరమైన భోజనం..

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్


పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్నభోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టిక, మధ్నాహ్న భోజనం బియ్యాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో శత శాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిరోజు వండిన ఆహారాన్ని పరిశీలించాలని ఆదేశించారు. వెంట ఎంఈవో కృష్ణహరి, హెచ్ఎం మురళీధర్ తదితరులు ఉన్నారు.

### సైబర్‌నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాకీ కిడ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇదే విధంగా ట్రాఫిక్, రోడ్డు భద్రతపై బాధ్యతాయుత పౌరులుగా ఉండాలన్నారు.

● చందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్ఐ అంజయ్య అన్నారు. మండలంలోని మల్యాలలో మీకోసం పోలీస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### దేశరక్షణ కోసం యువత ముందుకురావాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 21 (అంధ్రజ్యోతి) : దేశ రక్షణ కోసం యువత ముందుకు వచ్చి భారత సాయుధ బలగాల్లో ఉద్యోగాలను సాధించేందుకు యత్నించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 10వ వార్డు కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల పరిధిలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన కామిరే ప్రదీప్‌గౌడ్ భారత సాయుధ బలగంలో అసిస్టెంట్ కమాండర్‌గా పదోన్నతి పొంది శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామమైన ముష్టిపల్లి వచ్చిన అతన్ని చిన్నబోనాలలో మంగళవారం కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ అధ్వర్యంలో పలువురు సన్మానించారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిరలోని అంగన్‌వాడీ కేంద్రంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ సుమలత, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సరిత, ఉపాధ్యాయులు ఫాతిమా, ఉమ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

### క్యాట్ ఒలంపియాడ్ ఫలితాల్లో ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మంగళవారం తెలిపారు. పాఠశాలలోని మొత్తం 51 మంది విద్యార్థులు తమ సత్తా చాటారని పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థులు నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారని చెప్పారు. డీన్ విజయ్‌బాబు, ఇన్‌చార్జి మహేశ్, పూర్ణిమ, దివ్య, ఏవో శేఖర్, ఒలంపియాడ్ ఇన్‌చార్జి పూర్ణచందర్, పీఈటీ బాపురెడ్డి, ఉపాధ్యాయులు కల్పలత, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.